# 'పునాది రాళ్ళు'

'కృష్ణజ'




"అరుణా...."

"అమ్మాయ్ అరుణా" ఈసారి మరి కొంచెం పెద్దగా పిలిచారు కమలమ్మగారు.

"ఏంటమ్మా?" తిరగేస్తున్న పత్రికలో నుండి తల పైకెత్తి విసుగ్గా ముఖం చిట్లిస్తూ అడిగింది అరుణ.

కూతురి ముఖం చూస్తూ మరి నోరెత్త లేక పోయింది కమలమ్మ.

"అరుణా....అరుణా అంటూ ప్రాణం తీసి, ఏమిటంటే చెప్పవేం...." కసురుకున్నట్లుగా అంది అరుణ.

"ఏం లేదు. రాత్రికి కూర ఏం వండాలో చెప్తావని" నెమ్మదిగా గొణిగింది కమలమ్మ.

ఆవిడకు కూతురితో మాట్లాడాలని ఎంత కోరికగా ఉందో అంత భయం కూడా. అరుణ ప్రతి చిన్న విషయానికీ విసుక్కుంటుంది. చికాకు పడుతుంది.

"అబ్బబ్బ. ఏదో ఒక కూర తగలబెట్టమ్మా. రోజూ ఇదో సతాయింపు"

కసురుకున్నట్టుగా అని గదిలోకి వెళ్ళిపోయింది అరుణ. మౌనంగా వంటగదిలోకి నడిచింది కమలమ్మ బియ్యం చేటతో.

'కూతురు ఓ క్షణం తనతో ఆత్మీయంగా మాట్లాడకూడదూ!' ఇదీ ఆమె కనీస కోరిక.

"మమ్మీ! మమ్మీ!" ఆట నుండి తిరిగి వచ్చిన 'స్వీటీ' అరుణ కాళ్ళకు చుట్టుకు పోయింది.

అరుణ కూతురిని ఎత్తుకుని గాఢంగా ముద్దులు కురిపించింది.

"మరేమో మమ్మీ స్వీటీ ఏం చేసిందో తెలుసా?" చెల్లెలి మీద ఏదో చెబుతున్నాడు నవీన్.

పిల్లలిద్దరూ చక్కగా స్నానం చేసి ఇస్త్రీ బట్టలతో అందంగా ముస్తాబయి వున్నారు.

అరుణ కడిగిన ముత్యాల్లా వున్న పిల్లల్ని చూసుకుని గర్వంతో పొంగిపోయింది.

కానీ, పిల్లల్ని అంత నీట్‌గా వుంచడంలో తల్లి ఎంత శ్రద్ధ తీసుకుంటుందో, ఎంత శ్రమ పడుతుందో మాత్రం అరుణ మానసిక పరిధిలోకి రాదు.

*

అరుణ స్నానం చేసి జడ అల్లుకుంటుండగా శేఖర్ ఇంటికి వచ్చాడు.

శేఖర్‌ను గుమ్మంలో చూస్తూనే, "అమ్మా,

ఆయన వచ్చారు. కాఫీ కలుపు.'' వంటింట్లోకి ఓ కేక పెట్టి భర్తతో పాటుగా గదిలోకి నడిచింది అరుణ.

చేస్తున్న పనిని ఆపి కాఫీ కలిపి కూతుర్ని కేకేసి ఇచ్చింది కమలమ్మ. వంట పూర్తవుతూనే పిల్లలిద్దర్నీ పిలిచి అన్నాలు తినిపించి అరుణకూ శేఖర్‌కూ కంచాలు కడిగి మంచినీళ్ళు పెట్టి వచ్చి పెరట్లో పడుతున్న వెన్నెలను చూస్తూ కూర్చుంది కమలమ్మ.

లోపల అరుణా, శేఖర్ భోంచేస్తున్నారు, కొబ్బరి చెట్టుమీద పడుతున్న వెన్నెలను చూస్తూ క్రమంగా ఆలోచనల్లోకి జారిపోయింది కమలమ్మ.

"అమ్మా!''

"ఊఁ... '' పరధ్యానంగా పలికింది కమలమ్మ.

"అసలు వంట చెయ్యాలనే చేస్తున్నావా....?''

"ఆఁ...'' అదే పరధ్యానం.

"చెయ్యాలని చేస్తే వంటలు ఇలా ఎందుకు తగలడతాయి...? నీకిష్టం లేకపోతే మానెయ్యరాదూ. చేతనైతే చేసుకుంటాను. లేకపోతే మానుకుంటాను....''

ముఖమంతా ధుమధుమలాడుతుండగా కేకలు వేస్తోంది అరుణ. పరధ్యానం వదిలిపోగా వాస్తవంలోకి వచ్చిన కమలమ్మ "ఏమైంది అరుణా....?'' అంది గాభరాగా.

"ఏమవ్వాలి? కూర బావుండలేదు. అందుకే ఆయన సరిగా భోంచెయ్య లేదు. పరాయి కొంపల్లోనైతే బాగానే చేస్తారు'' విసురుగా వెళ్ళిపోయింది అరుణ గదిలోకి.

కమలమ్మ కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

గదిలో నుండి కూతురూ అల్లుడి మాటలు వద్దన్నా వినిపిస్తున్నాయి.

"అరూ! అవిణ్ణెందుకు కేకలేస్తున్నావు.... నాకు ఆకలి లేక అన్నం సరిగ్గా తినలేదు. కూరకేం చాలా బావుంది.''

"ఆకలి లేకపోవడం ఏం? కూర నచ్చకే మీరు సరిగా భోంచెయ్య లేదు.''

"లేదు అరుణా. ఇవాళ ఆఫీసులో పార్టీ చేశారు. అందుకే ఆకలిలేదు.''

ఆ తరువాత పార్టీ ఎందుకు చేశారో పార్టీలో ఎవరు ఎలా ప్రవర్తించారో చెబుతూండగా కూర విషయం మరిచిపోయింది అరుణ.

### వెయ్యేళ్ళ క్రితంనాటి ఉద్యోగినులు

దాదాపుగా వెయ్యి సంవత్సరాల క్రితమే మనదేశంలో స్త్రీలు ఉద్యోగాలు చేసేవారని యిటీవల తమిళనాడులో బయటపడిన ప్రాచీన శిలాశాసనాలబట్టి తెలియవచ్చింది. క్రీ. శ. 985 నుంచి క్రీ. శ. 1014 వరకు పాలించిన చోళరాజయిన మొదటి రాజరాజచోళుని కాలాన స్త్రీలు ఉన్నత పదవులు వహించారనీ వారి అధికారానికి లోబడి ఎందరో పురుషులు పనిచేసేవారనీ ఈ శాసనాలు చెబుతున్నాయి.

కమలమ్మ మౌనంగా నిట్టూర్చింది.

తెల్లవారి లేచి పని చేసేందుకు ఓపిక ఉండాలి. అందుకే ఏదో తిన్నాననిపించి వంటిల్లు సర్దిపెట్టి బయటికి వచ్చింది.

" అమ్మమ్మా కథ చెప్పవూ '' స్వీటీ వచ్చి అమ్మమ్మ ఒళ్ళో కూర్చుంది ముద్దుగా.

కమలమ్మ పాపను గుండెలకు హత్తుకుంది ఆర్తిగా. ఈ పిల్లల ప్రేమ, ఈ తియ్యనైన పిలుపు తప్ప జీవితంలో ఇంక తనకేం మిగిలాయి.

మరో కొన్నాళ్ళకు ఈ పిలుపులోని మధురిమ కూడా గగన కుసుమమే అవుతుంది తనకు...

"అమ్మమ్మా! కథ చెప్పవూ ...?'' నవీన్ అభ్యర్థన.

"సరే వినండి. అనగా అనగా ఒక రాజు....''

"అమ్మమ్మా రాజుల కథలు వద్దు.''

"రాక్షసుల కథ చెప్పు అమ్మమ్మా.''

"ఇందులో రాక్షసుడు కూడా ఉన్నాడు పాపా....''

"అమ్మమ్మా రాక్షసుడికి పెద్ద పెద్ద కోరలూ కొమ్ములూ ఉంటాయి కదూ?''

"అవునమ్మా. రాక్షసుడికి పెద్ద పెద్ద కోరలూ, కొమ్ములూ, చింతనిప్పుల్లాంటి కళ్ళూ, పెద్ద పొట్టా ఉంటాయి.''

అరుణా, శేఖర్ సెకండ్ షో సినిమాకు వెళ్ళేందుకు తయారయి బయటికి వచ్చారు.

"పిల్లలకు అలాంటి కథలు చెప్పొద్దని ఎన్నిసార్లు చెప్పాను. ఛ....ఛ ఒక్కసారి చెబితే అర్థం కాదు....''

విసుక్కుంటూ బయటికి వెళ్ళిపోయింది అరుణ.

కమలమ్మ తక్కున ఆపేసింది చెబుతున్న కథను.

పిల్లలు బిక్కమొహాలు వేశారు.

ఆ చిన్నారి హృదయాల్లో అమ్మమ్మ పట్ల బోలెడు సానుభూతి...అమ్మ మీద కోపమూ కలిగాయి.

"అమ్మ అసలు మంచిది కాదు....'' అన్నాడు నవీన్.

"అవును. అమ్మ మంచిది కాదు. మనల్ని సినిమాకు తీసుకెళ్ళలేదుగా'' స్వీటీ అన్నయ్యకు వంత పలికింది. ఆ పిల్లకు అమ్మతో సినిమాకు వెళ్ళనందుకు బెంగగా ఉంది.

"తప్పమ్మా అలా అనకూడదు. చాలా పొద్దు పోయింది పడుకోండి.'' కమలమ్మ పిల్లలిద్దర్నీ పడుకోబెట్టి దుప్పటి కప్పింది. ఐదు నిముషాలు కాకుండానే నిద్రపోయారు పిల్లలిద్దరూ.

నిద్రపోయిన 'స్వీటీ' ముఖం చూస్తున్న కమలమ్మకు అరుణ ఐదు సంవత్సరాల పాపగా ఉన్నప్పటి రూపం కనిపించింది.

ప్రేమగా బుగ్గలు పుణికింది.

'వయస్సు పెరుగుతున్న కొద్దీ మనుష్యుల్లో కాఠిన్యం పెరుగుతుందా? లేక తమమీద ఆర్థికంగా ఆధారపడిన వాళ్ళమీద విసుగు కలుగుతుందా....?'

కమలమ్మకు జవాబు దొరకని ప్రశ్న ఇది.

*

కమలమ్మ భర్త జగన్నాథ్ ఓ ప్రైవేటు కంపెనీలో ఓ మామూలు గుమస్తా....

జగన్నాథ్ భార్యను అమితంగా ప్రేమించేవాడు. వ్యక్తిగా గౌరవించేవాడు.

అలాంటి భర్త దొరకడం తన అదృష్టంగా భావించి మురిసిపోయేది కమల.

పాలూ-నీళ్ళుగా కలిసిపోయిన వారి దాంపత్య జీవితానికి చిన్నారి అరుణ మణి దీపం.

అరుణ ఐదేళ్ళ పాపగా ఉన్నప్పుడే వారి అన్యోన్యతను చూసి ఓర్వలేని విధి రైలు ప్రమాదం రూపంలో జగన్నాథాన్ని కబళించి తల్లీ బిడ్డను దిక్కులేని వాళ్ళుగా చేసి నడివీధిలో నిలబెట్టింది.

అనురాగమూర్తి అయిన భర్తను పోగొట్టుకున్న పుట్టెడు దుఃఖాన్నీ గుండెల్లో ఇముడ్చుకుని రేపు ఎలా....? అన్న సమస్యను ఎదుర్కొంది కమలమ్మ.

చెప్పుకోదగ్గ బంధువులు గానీ, సహాయం చేసే స్నేహితులు గానీ లేరు.

ఎవరు ఉన్నా ఎంత కాలం సహాయం చేయగలరు....? నిండా ఇరవై కూడా నిండని వయస్సులో పసి పిల్లతో వేటకుక్కల్లాంటి మనుష్యుల మధ్య ఒంటరిగా జీవితాన్నెదుర్కొంది కమలమ్మ.

ఓ లాయరుగారింట్లో వంట మనిషిగా కుదిరింది. తీరిక వేళల బట్టలు కుడుతూ జీవితం సాగించింది.

అరుణను స్కూల్లో చేర్పించింది.

జీవితం సంతోషంగా కాకపోయినా మామూలుగా గడిచిపోతుండగా అంచెలంచలుగా అరుణ గ్రాడ్యుయేట్ అయ్యింది.

అరుణ చదువు పూర్తవుతూనే లాయరుగారు తన పలుకుబడిని ఉపయోగించి అరుణకు ఉద్యోగం వేయించారు.

కమలమ్మ సంతోషించింది.

"అమ్మా! నువ్వింక తాతయ్య వాళ్ళింట్లో పని మానెయ్య కూడదూ" అంది అరుణ ఉద్యోగస్థురాలయిన మొదటి నెల.

కమలమ్మ లాయరుగారిని 'బాబయ్ గారూ' అంటుంది. ఆయన కమలమ్మను వంట మనిషిగా కాక స్వంత కూతురిగానే ఆదరించారు.

కమలమ్మకు పని అంటే భారంలేదు. స్వశక్తి మీద బ్రతుకు గడపాలనేదే ఆమె ఆశయం. అలా చెప్పి కూతుర్ని నొప్పించలేదు.

"ఎందుకమ్మా, ఇప్పుడు తాతయ్య వాళ్ళింట్లో నాకేం కష్టం వచ్చింది. నేను లేకపోతే వాళ్ళకు ఇబ్బంది అవుతుంది. ఇంతకాలం మనకెంతో అండగా ఉన్నారు. ఇప్పుడు వాళ్ళను ఒదిలి పెట్టడం ఏం న్యాయం?" అంది నచ్చ చెబుతున్నట్లుగా.

అరుణకు మనస్సులో ఇష్టం లేకపోయినా మౌనంగా ఉండిపోయింది.

ఉద్యోగస్థురాలయిన తనకు తన తల్లి వంట మనిషి అంటే ఎంత నామోషీయో తల్లికి అర్థం కానందుకు మనస్సులోనే విసుక్కుంది.

అరుణకు శేఖర్ అఫీసులో పరిచయం అయ్యాడు. క్రమేపీ వారి పరిచయం ప్రేమగా మారి పెళ్ళికి దారి తీసింది. అరుణ వైపున కమలమ్మ అభ్యంతర పెట్టేందుకేమీ లేదు. శేఖర్ వైపున అభ్యంతర పెట్టేందుకు ఎవరూ లేరు. కులమతాల ప్రసక్తీ, కట్న కానుకల ఆసక్తీ లేకుండానే లాయరుగారి ఆశీర్వాదంతో అరుణ శేఖర్‌లు దంపతులయ్యారు, స్నేహితులకో చిన్న పార్టీ ఏర్పాటు చేసి.

ఎన్నో ఏళ్ళుగా కష్టార్జితం డబ్బుగా మార్చి అరుణ పెళ్ళికోసం కూడబెట్టిన మొత్తాన్ని అల్లుడు కట్నం తీసుకోక పోవడం చేత కూతురికి నగలుగా మార్చి తృప్తిపడింది కమలమ్మ.

"అత్తయ్యగారూ, మీరూ మాతో ఉండి పోగూడదూ....? మాకు మాత్రం పెద్ద దిక్కు ఎవరున్నారు...?" అన్నాడు పెళ్ళయిన కొన్నాళ్ళకి శేఖర్ ఎంతో ఆత్మీయంగా.

కమలమ్మ అల్లుడి ఆత్మీయమైన ఆహ్వానానికి సంతోషించినా స్వాభిమానమూ, శ్రమ గౌరవమూ వున్నందున అల్లుడి ఆహ్వానాన్ని సున్నితంగానే త్రోసి పుచ్చింది.

"ఇక్కడ మాత్రం నాకు లోటేముంది బాబూ! కన్నతండ్రి వంటి లాయరుగారి కుటుంబం నీడలో నాకు హాయిగానే గడిచిపోతోంది. ఇప్పటి నుండీ మీకు భారం ఎందుకూ? చెయ్యి, కాలు వంగి నప్పుడు మీకు ఎలాగూ తప్పదు...."

**పొగలేని బొగ్గు**

పొయ్యి మండుతున్నప్పుడు పొగ రాని కొత్త రకం బొగ్గును చండీఘర్ దగ్గర ఉన్న మొహలి అనే చోట తయారుచేస్తున్నారు. 'పారు' అనే పేరుగల ఈ బొగ్గుకు ఊక, రంపపుపొట్టు, చెరకుపిప్పి మూలపదార్థాలు. ఈ బొగ్గు ఒక కిలో తయారుచెయ్యడానికి పదిహేను పైసలు ఖర్చవుతుందట. కిలో యాభై పైసల ధరకు అమ్మవచ్చునని అంచనా. వంట చెరకుగా వాడే మామూలు బొగ్గు ధరకన్నా ఈ 'పారు' ఇంధనం ధర దాదాపు అరవై శాతం తక్కువ. పొగ ఉండకపోవడంవల్ల ఈ బొగ్గువల్ల వాతావరణ కాలుష్యం ఉండదు.

"మాకు భారం అని ఎందుకనుకుంటున్నారు..? మీ అబ్బాయి అయితే ఇలాగే అంటారా? అల్లుణ్ణి అయినంత మాత్రాన పరాయి వాణ్ణేనా....?"

శేఖర్ బాధ చూసి కమలమ్మ నొచ్చుకుంది.... ఛ....ఛ....తను అలా అనకుండా ఉండవలసింది. అనుకుంది.

"కాదు బాబూ! నేను వచ్చేస్తే లాయరుగారి కుటుంబం చాలా ఇబ్బందిపడతారు. కష్టాల్లో నాకు అండగా నిలిచారు. ఇప్పుడు వాళ్ళను ఇబ్బంది పెట్టడం ఏం బాగుంటుంది బాబూ?" అంది అల్లుడికి నచ్చ చెబుతున్నట్లుగా.

శేఖర్ మరి మాట్లాడలేకపోయాడు.

రెండో రోజే అరుణ వచ్చింది ధుమధుమలాడుతూ.

"అమ్మా! నిన్న ఆయన పిలిస్తే రానన్నావట."

"అవునమ్మా! తాతయ్యగారింట్లో ఇబ్బంది అవుతుందని—"

తల్లి మాటలు ఇంకా పూర్తి కాకుండానే అసహనంగా అందుకుంది అరుణ. "ఎంతసేపూ వాళ్ళకు ఇబ్బంది, వాళ్ళకు ఇబ్బంది అంటావేం.... నువ్వు తప్పితే వాళ్ళకు ఇక ప్రపంచంలో మనిషే దొరకదా....?"

'వాళ్ళకు మనిషీ, తనకు తిండీ, బట్టా దొరక వచ్చు....కానీ, అంతటి ఆప్యాయత, మంచి మనసు అందించే మనుష్యులు దొరకరు' అనుకుంది కమలమ్మ మనసులో.

"కూతురూ, అల్లుడూ ఉద్యోగాలు చేస్తుండగా ఫలానా వాళ్ళ అమ్మ వంట చేస్తుంది అంటే మాకెంత చిన్నతనంగా ఉంటుందో ఆలోచించవేం.... ఇంటి దగ్గిర పనికి నాకూ ఇబ్బందిగానే ఉంది. ఇద్దరం బయటికి వెళ్ళేవాళ్ళమే."

అవాక్కై అయిపోయింది కమలమ్మ.

అరుణ పిలుపులో ఆత్మీయతలేదు. తన వల్ల అరుణ కొచ్చే 'చిన్నతనం' ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాదు, అరుణకో నమ్మకమైన పని మనిషీ, వంట మనిషీ కావాలి.

ఈసారి కమలమ్మ మరేమీ మాట్లాడలేదు.

అరుణ అభ్యంతరాలు లాయర్‌గారికి చెప్పి ఆయన వద్ద సెలవు తీసుకుంది.

కమలమ్మ పేరుకే ఆ ఇంటి వంట మనిషి. 'అమ్మాయ్ కమలా' అనీ, 'అక్కా' అనీ, 'పిన్నీ' అనీ ఆ ఇంట అందరూ ఆమెను ఆప్యాయంగానే చూసుకుంటారు.

కమలమ్మ కూడా అందరికీ అన్నీ వేళకు అమర్చిపెడుతూ, వాళ్ళ తృప్తిలో తన సుఖం చూసుకుంటూ కుటుంబ సభ్యురాలిలా కలిసిపోయింది.

ఒక్కరోజు కమల లేకపోతే ఈ ఇల్లు ఎలా గడుస్తుంది? అనే స్థితికి వచ్చింది లాయరుగారి కుటుంబం.

పని మనిషిగా చేరిన చోట ఇంటి మనిషిగా ఆదరించబడింది. కానీ, కన్న కూతురి ఇంట పని మనిషి కంటే కూడా హీనంగా....

*

"అరుణా! సినిమా ఎలా ఉంది....?" అంది

ఉపయం బ్రష్‌తో పళ్ళు తోముకుంటున్న అరుణతో.

''బాగానే వుంది.'' అంది అరుణ చాలా ముక్త సరిగా. అది చాలా పాత సినిమా 'మిస్సమ్మ'. చందమామలా ఉన్న 'సావిత్రి' ఆ సినిమాలో చాలా బాగా నటించింది అనుకుంటారందరూ.... కమలమ్మ చూడలేకపోయింది మొదటిసారి. ఒకప్పుడు ఆంధ్రుల అభిమాన తారగా సిరిసంపదలతో, కీర్తి ప్రతిష్ఠలతో మకుటం లేని మహారాణిగా చిత్ర సీమలో వెలిగిన సావిత్రి దయనీయమైన మరణాన్ని తలుచుకుంటే చాలు కమలమ్మకు ప్రతిసారీ కళ్ళల్లో నీళ్ళు చిమ్ముతాయి.

సావిత్రి అంటే ఆమెకు చెప్పలేనంత అభిమానం.... బంధాలూ, అనుబంధాలూ ఆత్మీయతలూ శాశ్వతమని, నమ్మే వెర్రివాళ్ళ జీవితాలెప్పుడూ దయనీయంగానే ముగిసిపోతా యనేందుకు సావిత్రి జీవితం ఓ ఉదహరణ అనుకుంటుంది కమలమ్మ ఎప్పుడూ.

ఒక్కసారి సినిమాలో సావిత్రిని చూడగలిగితే....కమలమ్మలో సావిత్రిని చూడాలనే వాంఛ నిమిష నిమిషానికీ గాఢమవుతోంది.

కానీ సినిమాకు వెడతానని కూతుర్ని అడిగేందుకు అభిమానం అడ్డు వస్తోంది.

కమలమ్మ అరుణను అడిగేందుకు చాలాసేపు తటపటాయించింది. అరుణ ఆఫీసుకు వెళ్ళేందుకు తయారవుతోంది. అమె వెళ్ళిపోతే మళ్ళీ వెళ్ళేందుకు కుదరదు.

సావిత్రి మీది మమకారం స్వాభిమానాన్ని జయించింది. ''అమ్మాయ్.... పక్కింటి వాళ్ళు మ్యాట్నీకి వెడుతున్నారు నేనూ వెడతాను'' అంది. భయం భయంగా.

అరుణ ఒక్కసారి చురుక్కున చూసింది తల్లి వంక.

ఆ తరువాత తనను తాను సమాధాన పరచుకుని ''ఆదివారం వెడుదువుగాన్లె'' అంది.

అన్నదే గానీ ఆదివారం కుదరదని ఆమెకూ తెలుసు.

''ఆ సినిమా వెళ్ళిపోతుందట అరుణా''

''పోతే పోనీ అమ్మా .... అయినా నీకీ వయసులో ఇంత సినిమా పిచ్చేమిటీ....?'' అంది ముఖం చిట్లించుకుంటూ అసహనంగా.

అల్లుడు వింటున్నాడేమోనని సిగ్గుతో చితికి పోయింది కమలమ్మ. దెబ్బతిన్న హృదయంతో లోపలికి వెళ్ళిపోయింది.



తలలో పేలు, చుండ్రులకు చిట్కా

తలలో పేలు, చుండ్రువుంటే వాటి నివారణకు ఇదిగో చిన్న చిట్కా వైద్యం!

తలలో పేలు, చుండ్రు, ఈ రెండింటి నివారణకు వేపనూనె బాగా పనిచేస్తుంది. పచారీ షాపుల్లో ఈ వేపనూనె విడిగా అమ్ముతారు. చుండ్రు, పేలుకలవారు, వేపనూనెను మాడు భాగంలో బాగా మర్దించుకొని, ఎండలో ఒక అరగంటసేపు వుండి తర్వాత కుంకుడుకాయతో స్నానం చేస్తే తలలో పేలు, చుండ్రు మళ్ళీ కనిపించవు.

గోరింటాకు బాగా రుబ్బి వస్త్రఘాళితం చేయగ్గా వచ్చిన రసాన్ని, మాడుకి మర్దిస్తే, చుండ్రు నివారణ అవుతుంది. పేలు నివారణకు యిది పనికి రాదు.

—మల్లిడి కనకరత్నం

తనకు సినిమా పిచ్చట. కనీసం తను సంవత్సరానికి ఒకటైనా చూడదే, దానికి నోరెలా వచ్చింది అంత మాటనేందుకు.

కమలమ్మ పళ్ళ బిగువున దుఃఖాన్ని ఆపుకుంది.

భర్త బ్రతికి ఉన్నప్పుడు ఇద్దరూ కలసి తరుచు సినిమాలు చూసేవారు. తను పోయిన తరువాత అన్ని కోరికలతో పాటు ఆ కోరికా చచ్చిపోయింది. ఏకాస్తో బ్రతికి ఉన్నా కూతురికి భయపడి దాన్ని చంపేస్తోంది.

ఈ బిడ్డనేనా తను గుండెల్లో పెట్టుకుని పెంచింది? ఈ బిడ్డ వున్నతి కోసమేగా తను పగలూ రాత్రీ అనే భేదం లేకుండా శ్రమపడింది?

అమ్మా! అంటూ నోరు తెరిచి అడగకముందే తన శక్తికి మించినవైనా కోరికలు తీర్చింది ఈ బిడ్డకేనా? తన ప్రాణం తన సర్వస్వం తన బ్రతుకూ తన ఆశలూ అన్నీ ఈ బిడ్డలోనేగా దాచుకుంది.

ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి, గుండెలు ఆక్రోశిస్తున్నాయి. 'అసలు ఈ మధ్య మా అమ్మకు కుళ్ళు బాగా పెరిగిపోయిందండీ'' అరుణ శేఖర్‌తో చెబుతోంది వడ్డిస్తూ.

''ఏం....?''

''రాత్రి మనం సినిమాకు వెళ్ళాంగా తెల్లారి పాటికి తనూ వెడతానని రెడీ.''

''పోనీ, వెళ్ళమనక పోయావా...?''

''సరి....సరి....మీకు చెబితే ఇలాగే ఉంటుంది ఇప్పుడు ఆమెకు సినిమాలు తక్కువయ్యాయా డబ్బు దండగ కాకపోతే.''

''పోనీ, అరుణా! ఆమెకూ చూడాలని ఉంటుందిగా.'' ''మీకు తెలీదు. మీరూరుకోండి. ఇలా నేర్పితే ఇక ప్రతిదానికీ నేనంటుంది .... మనకూ పిల్లలున్నారు....''

శేఖర్ మాట్లాడకుండా భోం చేస్తున్నాడు.... ఆమె మూర్ఖపువాదన అతనికి అయిష్టం, అసహ్యం.

అందుకే అతనా విషయంలో ఎక్కువగా జోక్యం చేసుకోడు.

❋

''బట్టలు ఇస్త్రీ చేశావా....?''

''ఒక్క చీర చేశాను అరుణా. మిగిలినవి ఇవాళ చేస్తాను....''

''అదేం....?'' తీవ్రంగా అడిగింది అరుణ.

అప్పటికే ఆమెకు కోపం వచ్చేసింది.

''పని తీరలేదమ్మా నిన్న. ఈ రోజు చేస్తాను..''

''అంటే నా ఇంట్లో నీకు తీరనంత పని ఉందనేగా అర్థం. పరాయి వాళ్ళకు చేసినప్పుడు బావుంది....''

అప్పటికి అరుణలోని కోపం యొక్క స్థాయి ఆమె ఆపుకోలేని పరిస్థితిలోకి వచ్చేసింది.

''అవన్నీ ఎందుకు అరుణా చేస్తానన్నానుగా..''

''ఛ...ఛ....వెధవ కొంప. తినడానికి అందరూ వుంటారు. ఆఫీసులో అడ్డమైన చాకిరీ చేసి రావాలా? కొంపే చూసుకోవాలా?''

అరుణ దండకం ఆఫీసుకు వెళ్ళేవరకూ సాగిపోతూనే వుంది. నిజమే ఇది అరుణ ఇల్లే. తనకు ఇందులో ఏమీ లేదు. కేవలం పని మనిషి, చాకలి, వంట మనిషి, కనీసం అరుణకు అమ్మ కూడా కాదు.

కమలమ్మ మనసు ఆమెను ప్రశ్నిస్తోంది—

'కోరికలు చంపుకుని కూతురే సర్వస్వం అని బ్రతికిన కమలా నీకు పిడికెడు ఆత్మీయత మిగలలేదెందుకని—?'

అంతస్థుల మీద అంతస్థులు లేచిన భవనం యొక్క పునాది రాళ్ళను గురించి ఆలోచించేదెవరు—? □